www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 జులై 2023
5
చిత్తూరు

అక్రమకేసు పెట్టిన వారిపై విచారణ జరపండి

ఎస్పీకి బార్ అసోసియేషన్ ఫిర్యాదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: న్యాయవాది విజయ్ కుమార్‌పై వెదురుకుప్ప పోలీస్‌స్టేషన్లో అక్రమకేసు పెట్టిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బుధవారం బార్ అసోసియేషన్ నాయకులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

1000 రోజులు..!

టిటిడి అటవీ కార్మికుల చారిత్రాత్మక పోరాటం / నేడు రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ నిరసనలు

టిటిడి అటవీ కార్మికులు పెద్దఎత్తున తమ పోరాటాన్ని బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపునిచ్చారు. గురువారం పెద్దఎత్తున ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. 2020, నవంబర్ 25న ప్రారంభమైన ఈ దీక్ష గురువారం నాటికి వెయ్యి రోజులకు చేరుకోవడంతో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు తిరుపతిలో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ధర్మాన్ని రక్షించండి.. ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది' అని టిటిడి రాసుకున్న ధర్మసూత్రమిది. శ్రీవారి సన్నిధిలో అతి తక్కువ వేతనాలతో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న టిటిడి అటవీ కార్మికుల సమస్య అటు ప్రభుత్వానికి, ఇటు టిటిడికి పట్టలేదు. 'శ్రీవారూ మీరైనా కనికరించండి.. మీ దగ్గర సేవ చేసుకుంటున్న మాకు అన్యాయం చేయడం ధర్మామా' అంటూ టిటిడి కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను, బోర్డు తీర్మానాలను అమలు చేయాలని శాంతియుతంగా దీక్ష ప్రారంభించి గురువారం నాటికి వెయ్యి రోజులయ్యింది. రాష్ట్రంలోనే ఇది అతిపెద్ద పోరాటంగా చెప్పవచ్చు. టిటిడి అటవీ కార్మికులు 200 మంది మూడు సంవత్సరాలుగా అనేక ఒడిదుడుకులను, ఎండలను, వర్షాలను, చలిలోనూ నిరసన దీక్ష కొనసాగిస్తూనే ఉన్నారు. తమ న్యాయమైన కోర్కెలను టిటిడి యాజమాన్యం పట్టించుకోకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తోంది. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మూడున్నరేళ్ల క్రితం తిరుపతి పర్యటన సందర్భంగా 'మీ హామీ ఇంకా పరిష్కారం కాలేదా' అని స్పందిస్తూ 24 గంటల్లో పరిష్కారం చూపుతామని మరోసారి హామీ ఇచ్చారు. 2019లో స్వయంగా టిటిడి బోర్డులో సైతం తీర్మానం చేశారు. టిటిడి అటవీ కార్మికులు 362 మంది ఉండగా కేవలం 162 మందిని మాత్రమే పర్మినెంట్ చేసి, మిగిలిన వారిని టైంస్కేలు ఇవ్వకుండా టిటిడి కార్పొరేషన్‌లో ఏకపక్షంగా కలిపేసింది. కార్పొరేషన్‌లో కలపొద్దు, టైంస్కేలు కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించినా టిటిడి పెడచెవిన పెట్టింది. అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో అన్న విధంగా టిటిడి అటవీ కార్మికుల పట్ల వివక్ష పాటించి అధర్మంగా వ్యవహరించింది. ధార్మిక క్షేత్రంలో కార్మికుల పట్ల టిటిడి ధర్మం తప్పుతోంది.

నాణ్యమైన విద్యుత్ సరఫరా ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- వికోట: రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర భూగర్భ ఘనులు, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన మండల పరిధిలోని తోటకనుమ పంచాయతీ పరిధిలో సుమారు 6 ఎకరాల స్థలం, రూ.30కోట్ల వ్యయంతో నిర్మించనున్న 132/33 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ స్థాపనకు భూమిపూజ కార్యక్రమానికి బుధవారం ముఖ్యఅతిథులుగా హాజరై శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లోవోల్టేజ్ సమస్యను అధిగమించే లక్ష్యంతో అవసరమైన ప్రాంతాల్లో నూతన సబ్‌స్టేషన్లు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. తోటకనుమ పంచాయతీలో ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్ వల్ల ఈ ప్రాంత ప్రజలకు రైతులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు వీలుపడుతుందని అన్నారు. వీటితోపాటు అధికారులు ప్రజాప్రతినిధులు గుర్తించిన ఇతర ప్రాంతాల్లో కూడా త్వరలో నూతన సబ్‌స్టేషన్లను ప్రారంభించినట్లు వారు తెలిపారు. చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలగురునాథ్, వికోట మండల వైస్‌ఎంపీపీ, తమీంఖాన్, కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

వికోటలో భూమిపూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మండలంలో ఆరు నూతన భవనాలు ప్రారంభం

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య,ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక సహకార సంఘం భవనం, సచివాలయం, బైరెడ్డిపల్లి, గంగినాయనపల్లిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపి రెడ్డప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, డిసిసిబి బ్యాంకు ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి, వైఎస్సార్ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, ఎంపిపి రెడ్డప్ప, వైస్ ఎంపిపిలు రూపాయి కుమార్, నారాయణస్వామి తహశీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ, సర్పంచ్ కొమ్ము వెంకటేష్, విఆర్ఓ రాజేష్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో..

'మాస్' దోపిడీ..!

వారికి జీతాలంది నాలుగు నెలలు
కలెక్టర్ ఆఫీసులో పారిశుధ్య కార్మికుల వ్యథ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఎక్కడా లేనంత సుందరమైన భవనం. ప్రభుత్వం జిల్లాల విభజన నేపథ్యంలో తాత్కాలికంగా కొలువుండేందుకు తిరుచానూరులోని టిటిడి నిర్మించిన పద్మావతి నిలయాన్ని అప్పగించారు. దీనికి నెలసరి అద్దె ప్రభుత్వం లక్ష రూపాయలు చెల్లిస్తోంది. జిల్లాలోని శాఖలన్నీ ఒకే గొడుగుకింద ఉన్నట్లుగా ఈ భవనంలో ఉన్నాయి. ఏ శాఖకు చెందిన అధికారి వద్దకు వెళ్లాలన్నా ఆటో అవసరం లేదు. నడవాల్సిన పనిలేదు. లిఫ్ట్ ఎక్కితే చాలు ఆ అధికారి వద్దకు వెళ్లి వారి బాధలను విన్నవించుకోవచ్చు. అలాంటి కలెక్టర్ భవనంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలందడం లేదు. అన్ని కార్యాలయాలను ప్రతిరోజూ అద్దంలా శుభ్రం చేయాలి. అద్దాలను, బల్లలు, కుర్చీలు, ఫ్లోనింగ్ అన్నీ పరిశుభ్రంగా ఉంచాలి. దాదాపు 30 మంది మహర్షి అభ్యుదయ సేవా సమితి (మాస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీరు పనిచేస్తున్నారు. వీరికి నెలకు ఇచ్చే జీతం పదివేల లోపే. పొద్దంతా పనిచేసినా పూట గడిచే పరిస్థితి లేదు వీరికి. అలాంటి పారిశుధ్య కార్మికులకు ఇచ్చే అరకొర జీతం సైతం నెలనెలా ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్వయానా జిల్లా ఉన్నతాధికారులు ఉన్న చోటనే ఇటువంటి 'వెట్టి'చాకిరీ జరుగుతుండటం గమనార్హం. ఈ విషయమై మాస్ సంస్థ ఇన్‌ఛార్జి 'బాబి'ని 'ప్రజాశక్తి' వివరణ కోరగా బిల్లులు పెట్టామని, ఇంకా సంతకం కాలేదని, త్వరలోనే ఇచ్చేస్తాం అని చెప్పడం శోచనీయం.

కలెక్టరేట్లో ఫ్లోర్ శుభ్రం చేస్తూ...

పివికెఎన్‌లో యోగా డిప్లొమా సర్టిఫికెట్ల ప్రదానోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రోజువారీ జీవనవిధానాన్ని సరైన దారిలో ముందుకు తీసుకువెళ్లడానికి యోగా తోడ్పడుతుందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక పివికెఎన్ ప్రభుత్వ కళాశాలలో డిప్లొమా ఇన్ యోగా సర్టిఫికేట్‌ల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆరోగ్యం, మంచి నడవడిక నేర్చుకోవడంలో యోగా దోహదపడుతుందని అన్నారు. త్వరలో వారానికి ఒక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పివికెఎన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జీవనజ్యోతి మాట్లాడుతూ యోగా నేర్చుకోవడం ఒక దివ్యమైన విధానమని, అటువంటి యోగా శిక్షణ పివికెఎన్ కళాశాలలో నిర్వహిస్తుండడం చాలా గర్వకారణం అన్నారు. యోగా అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు వ్యవస్థాపక కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ యోగా అసోసియేషన్ ప్రారంభ వికాసాలను కష్ట నష్టాలను సభికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ విద్యార్థులకు సర్టిఫికేట్లను ప్రధానం చేశారు. కళాశాల యోగా కొ ఆర్డినేటర్ డాక్టర్ మోహన్ బెహ్రా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిజెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా

విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగర కేంద్రంలోని షెర్మాన్ గర్ల్స్ హైస్కూల్‌లో జిజెయం ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బస్సు పాసులు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవ నాయుడు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ అల్తాఫ్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు గీతాంజలి, ఆర్‌టిసి యూనియన్ నాయకులు తిరుమల నాయుడు పాల్గొన్నారు.

బిటిహెచ్ సంస్థతో

ఎస్పిఎంవివి అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి- క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, స్వీడన్ లోని బ్లేకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థతో అవగాహనతో కూడిన సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి. భారతి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిప్యూటీ డైరెక్టర్ ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆధ్వర్యంలో బ్లేకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బిటిహెచ్) సంస్థతో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ కోర్సులలో అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులకు పరిశోధనల, ప్రాజెక్టుల వర్కుల నిమిత్తం సహాయ సహకారాలు అందించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, వర్సిటీ ఇంటర్నేషనల్ డీన్ ఆచార్య విజయలక్ష్మి, ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆచార్య మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పాడి ద్వారా అదనపు ఆదాయం : జెసి

కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, వి.కోట: పాడి రైతులకు పాల ద్వారా అదనంగా ఆదాయం వచ్చే విధంగా అమూల్ సంస్థను ప్రభుత్వం తీసుకురావడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎంపిడిఓ కార్యాలయంలో కుప్పం ఆర్డీఓ శివయ్య, డిసిఓ బ్రహ్మానంద రెడ్డి, డెయిరీ డెవలప్మెంట్ అధికారి రవి చంద్ర, డిపిఓ లక్ష్మి,పశు సంవర్ధక శాఖ జెడి ప్రభాకర్, లతో కలసి జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా పాల ఉత్పత్తి పెంచుట, పాల సేకరణపై వలంటర్ల, విఆర్‌ఓలు, సంఘ మిత్రలు, పంచాయతీ కార్యదర్శిలు, పశు సంవర్ధక అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ పాడి రైతులకు పాల ద్వారా అదనంగా ఆదాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమూల్ సంస్థను తీసుకురావడం జరిగిందని తెలిపారు. వి.కోట మండలంలో 74 సొసైటీలలో 9750 మంది గాను 686 మంది రైతులు 9759 లీటర్ల పాలు అముల్‌కు పోస్తున్నారని తెలిపారు. మండలంలో 4690 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అందులో 686 మంది అమూల్‌కు పాలు పోస్తున్నారని మిగిలిన రైతులతో మాట్లాడి అమూల్‌కు పాలు పొచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా చేయూత, ఆసరా లబ్దిపొందిన రైతులకు పాడి ఆవులు కొనుగోలు చేసుకొని విదంగా వారికి అవగాహన చేయాలని వారిని కూడా అమూల్‌కు పాలు పొచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమూల్ సంస్థ మేనేజర్ లక్ష్మికాంత్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో మూడూ మండలాలలో 101 సొసైటీలలో 11500 లీటర్ల పాలు వస్తున్నాయని తెలిపారు. 150 లీటర్ల పాలు వచ్చే సొసైటీల పరిధిలో ఉన్న రైతుల 10 రోజులు అమూల్‌కు పాలు పోసిన రైతులకు రూ.30వేలు లోను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జగనన్న పాల వెల్లువ జిల్లా కోఆర్డినేటర్ నవీన్, తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపిడిఓ వినోద, పంచాయతీ సెక్రటరీలు, విఆర్ఓలు, వాలంటర్ల తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం: బుధవారం రామకుప్పంలో కుప్పం ఆర్డీఓ శివయ్యతో కలసి జగనన్న పాలవెల్లువపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. రామకుప్పం మండలంలో 18 సొసైటీలలో 1040 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అందులో 70 మంది రైతులు 1118 లీటర్ల పాలు పోస్తున్నారని అన్నారు. మిగిలిన రైతులు కూడా అమూల్‌కు పాలు పొయించేలా అవగాహన కలిగించాలని జెసి ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ జెడి.ప్రభాకర్, డిపిఓ లక్ష్మి, డిసిఓ బ్రహ్మానంద రెడ్డి, డిడిఓ రవిచంద్ర, తహసీల్దార్ మురళి, ఎంపిపి.సుబ్రహ్మణ్యం, జడ్పీటిసి నితిన్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

శాంతిపురం : బుధవారం స్థానిక ప్రవేటు కళ్యాణ్ మండపంలో డిఆర్డీఏ పిడి తులసి, కుప్పం ఆర్డీఓ శివయ్య, పశు సంవర్ధక శాఖ జెడి ప్రభాకర్, డిపిఓ లక్ష్మి, డిసిఓ బ్రహ్మానంద రెడ్డి, డిడిఓ రవిచంద్రతో కలసి జగనన్న పాల వెల్లువపై జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ మండలంలో 9 సొసైటీలలో 939 మంది పాడి రైతుల ఉన్నారని అందులో 52 మంది పాడి రైతులు 940 లీటర్ల పాలు అమూల్‌కు పోస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ హేమమాలిని, పంచాయతీ సెక్రటరీలు, విఆర్ఓలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల పరిశీలన: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఓటర్ల పరిశీలన కార్యక్రమం అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అన్నారు. బుధవారం ఓటర్ల జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈసమావేశంలో లికలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య ఎన్నికల అధికారి పంపిన ఆన్‌లైన్ రిపోర్ట్ ద్వారా పుంగనూరు నియోజకవర్గంలో 15 జూన్ 2023 నాటికి 862 ఓట్లు సున్నా డోర్ నెంబర్‌తో నమోదైనట్లు తెలిపారు. తదుపరి 165 పుంగనూరు నియోజకవర్గం లోని 261 పోలింగ్ కేంద్రాలను మాన్యువల్ గా పరిశీలించగా 1161 మాత్రమే సున్నా డోర్ నెంబర్ తో నమోదు కాబడి నట్లు వెల్లడైనట్లు తెలిపారు. ఇందులో 10 జూలై 2023 నాటికి 717 మందిని బిఎల్‌ఓల ద్వారా సరియైన డోర్ నెంబర్లను గుర్తించి ఫారం 8 ద్వారా ఓటర్ల డోర్ నెంబర్ నమోదు చేయడం జరిగిందని, మిగిలిన 145 మంది సున్నా డోర్ నెంబర్‌ల ఓటర్లను ఫారం ద్వారా సరియైన డోర్ నెంబర్‌లను నమోదు చేయడం జరుగుతుందన్నారు. బిఎల్‌ఓ యాప్‌లో సాంకేతిక ఇబ్బందుల కారణంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల పరిశీలన కార్యక్రమం నెమ్మదిగా కొనసాగుతున్నదని, సాంకేతిక లోపం ఉన్న సమాచారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి దష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, త్వరలో పరిష్కారం అవుతాయని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి బిఎల్‌ఓలు వెళ్ళి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారని, ఈ విషయంలో ఎటువంటి అనుమానాలు అవసరం లేదన్నారు. వెరిఫికేషన్ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్‌ఎలు హాజరు కావచ్చు అన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో వాలంటీర్ల జోక్యం ఉండబోదని స్పష్టం చేశారు. కుప్పం నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుగుతోందని జిల్లా కలెక్టర్ పార్టీ ప్రతినిధులకు వివరించారు. రాజకీయ పార్టీల వారు ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం వారు ఆదేశించిన మేరకు రుసుము చెల్లించి ఓటర్ల జాబితా వివరాలు తీసుకోవచ్చునని సూచించారు. అనంతరం డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి సచివాలయ ఆవరణంలో గల ఈవిఎం గోడౌన్‌కు వెళ్లి వివిప్యాట్‌ల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరీక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిజెపి, బీఎస్పీ, సిపిఐ, వైయస్‌ఆర్సీపీ, టిడిపి పార్టీల తరపున ప్రతినిధులు హాజరు అయ్యారు.

స్మార్ట్ రోడ్డు పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో చేపడుతున్న సుందరీకరణ పనులను బుధవారం సాయంత్రం నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పరిశీలించారు. రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన వనం, పచ్చదనం పరిరక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న గ్రిల్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రిల్స్ ఏర్పాటు పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పనులు వేగంగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. అనంతరం ఏఎస్ఎం కాంప్లెక్స్ లో పరిశుద్ధ పనుల నిర్వహణను తనిఖీ చేశారు. కాంప్లెక్స్ ఆవరణలో క్రమంతప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కాంప్లెక్స్ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులతో చర్చించారు. అనంతరం కమిషనర్ గాంధీ విగ్రహం సర్కిల్ నుండి భాస్కర్ హోటల్ వరకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ రోడ్ పనులను పరిశీలించారు. స్మార్ట్ రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డు వెడల్పు, ఇతరత్రా పనులపై ఇంజనీరింగ్ అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంఈ వెంకట ప్రసాద్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

రాగి గ్లాసుతో నీళ్లు.. అరటిఆకులో అన్నం..

- సుబ్బయ్యగారి హోటల్ ప్రత్యేకత
- తిరుపతి పద్మావతీపురంలో ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకినాడ సుబ్బయ్యగారి హోటల్‌ను రాష్ట్ర భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంఎల్ఏ భూమన కరుణారెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక పద్మావతిపురంలోని సుబ్బయ్యగారి హోటల్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ కాకినాడలో సుబ్బయ్య గారి హోటల్ చాలా ప్రసిద్ధి చెందిందన్నారు. సుబ్బయ్యగారి హోటల్‌కు దాదాపు 68 ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. ప్రకాశం జిల్లా నుంచి కాకినాడకు వలస వచ్చిన సుబ్బయ్య 1950లో పది మందితో కలసి కాకినాడలో చిన్న మెస్ ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్లేటు భోజనం కేవలం 50 పైసలకు విక్రయించేవారు. 1955లో ఈ మెస్‌ను 'శ్రీకష్ణ విలాస్' పేరుతో హోటల్‌గా మార్చారు. ఉభయ గోదావరి జిల్లాలోనే ఫేమస్ శాఖాహార హోటల్‌గా పేరొందిందని తెలిపారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాదులో తమ శాఖలను ఏర్పాటు చేశారని, ఇప్పుడు తిరుపతిలో కూడా ఈ హోటల్‌ను ఏర్పాటు చేసి, నాణ్యమైన, రుచికరమైన బోజనాన్ని నగర వాసులకు అందుబాటులోకి తీసుకురావడం అబినందనీయమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ హోటల్ డైరెక్టర్లు ఎం.కృష్ణకుమార్, వై.రాజేష్ మాట్లాడుతూ తమ హోటల్‌కు వచ్చే వినియోగదారులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, రాగిగ్లాసులో నీళు ,, అరిటి ఆకుల్లో బోజనాలను వడ్డిస్తామన్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా రుచికరమైన 30 రకాల వంటకాలను అందిస్తామన్నారు. వినియోగదారుడికి స్వీట్లు, పులిహోరా, పుదీనా రైస్, వెజ్ బిర్యానీ వడ్డిస్తారు, బూరెల్లో నెయి వేసి మరీ ఇస్తారు. జీడిపప్పు బూరి, బెల్లం గారెలు, గుత్తి వంకాయ, దొండకాయ, నేతి బూరెలతో పాటు వివిధ రకాల గోదావరి రుచులను ఒకేసారి ఆస్వాదించొచ్చన్నారు. తమ హోటల్‌లో రెస్టారెంట్, స్వీట్స్, బ్యాంకెట్ హాల్, ప్రీమియం రూమ్స్ లభ్యమవుతాయని, తిరుపతి వాసులు, యాత్రికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ మేయరు డాక్టరు శిరీషా, ఎంఎల్‌సి మెండితోక అరుణ్‌కుమార్, డిప్యూటీ మేయరు భూమన అభినయ్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తుడా విసి హరికృష్ణ, వైఎస్‌ఎన్.ప్రసాద్, గణపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ బాధితునికి సకాలంలో న్యాయం

ప్రజాశక్తి తిరుపతి సిటీ: సైబర్ నేరం ద్వారా పోగొట్టుకున్న రూ. 1,56,092 నగదును తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులు వాపెస్ చేయించి బాధితుడికి సకాలంలో న్యాయం చేశారు. జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ కేసును చేదించి, సైబర్ సెల్ సీఐ రామచంద్ర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా, ఎస్ .వి .యూ క్యాంపస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, న్యూ బాలాజీ కాలనీకి చెందిన డాక్టర్ సి .రమేష్ తన యూనియన్ బ్యాంకు అకౌంట్ నుంచి గత నెల 30 వ తేదీ, అతని మొబైల్ కు తన ఖాతా నుండి 17,500రూపాయలు లావాదేవీ జరిగినట్టు మెసేజ్ వచ్చింది. అతను వెంటనేవెళ్లి తన ఖాతాను చెక్ చేసుకుంటే తన బ్యాంక్ అకౌంట్ నుండి మొత్తం 1,56,092/- రూపాయలు పోయినట్లుగా గుర్తించాడు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు తిరుపతి సైబర్ క్రైమ్ లాబ్ ఆఫీస్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సైబర్ ల్యాబ్ ఇన్స్పెక్టర్ రామచంద్ర రెడ్డి అధ్వర్యంలో ఉన్న సైబర్ క్రైమ్ నిపుణులు రంగంలోకి దిగి, ఫిర్యాదుదారుని బ్యాంకు అకౌంట్ స్టేట్మెంట్ వివరాలను(ఫ్రాడ్ ట్రాన్సాక్షన్స్ డీటెయిల్స్) తీసుకొని ఆ ట్రాన్సాక్షన్స్ అన్ని కూడా పి ఓ ఎస్ (పాయింట్ అఫ్ సేల్) ట్రాన్సక్షన్ నుండి అమెజాన్ వాలెట్ కి వెళ్లినట్లుగా గుర్తించి, ఎన్ సి ఆర్ పి పోర్టల్ లో ఫిర్యాదును అప్లోడ్ చేశారు. తరువాత వెంటనే అమెజాన్ నోడల్ అధికారులతో మాట్లాడి మోసపూరిత నగదును స్తంభింప చేశారు. పోలీసులు తిరిగి బ్యాంక్ ఖాతాకు జమచేశారు.

ప్రజలకు ఉచితంగా ధ్రువపత్రాలు

ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రజలకు ఉచితంగా ప్రభుత్వ కార్యకలాపాలు, ధ్రువపత్రాలు అందజేస్తున్నట్టు పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని సంక్రాంతిపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం తహశీల్దార్ బెన్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ద్వారా కుల, నివాస, ఆదాయ, నూతన రేషన్ కార్డులు పంపిణీ ధ్రువపత్రాలను ఉచితంగా అందించేందుకు సురక్ష కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఎంపీపీ అమరావతి, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ బాలాజీ, జిల్లా సేవాదళ అధ్యక్షులు కిషోర్ కుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల పరిశీలన

కందూరు సమావేశంలో ఎంఈఓ -2 శివ రత్నమ్మ

ప్రజాశకి-సోమల: మండలంలో కందూరు, సోమల, నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సిఆర్‌సి ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను ఎంఈఓ- 2 శివరత్నమ్మ బుధవారం పరిశీలించారు. గత సిఆర్‌సి సమావేశాలలో తీసుకున్న, చేపట్టిన, ప్రగతి నివేదికలు, మాదిరి పాఠ్యాంశాలు, చేపట్టవలసిన అంశాలపై ఎంఈఓ ఉపాధ్యాయులకు పలు సూచనలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సులభతరంగా బోధించేందుకు ప్రభుత్వం అందజేస్తున్న నూతన విద్యావిధానాలను ప్రతి ఒక్క ఉపాధ్యాయులు అవపోషణ చేసుకొని విద్యార్థులకు బోధించాలని కోరారు. కార్యక్రమంలో సిఆర్పి ప్రధానోపాధ్యాయులు, సిఆర్పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-సోమల: చంటి పిల్లలకు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలను తల్లిదండ్రులు తప్పక వేయించాలని ఎంఎల్‌హెచ్‌పి శాంభవి అన్నారు. బుధవారం ఇరికిపెంట సచివాలయంలో చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు వైద్యపరీక్షలను అందజేసి పలువురు చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలను అందజేశారు. గర్భవతులు పౌష్టికాహారాన్ని విధిగా స్వీకరించాలని వైద్యుల సలహాలు సూచనల మేరకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని సుఖప్రసవం కోసం ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం మదనిక, ఆశా కార్యకర్తలు గుణవతి, శ్రీలక్ష్మి, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దపోటుచేనులో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం గ్రామ సచివాలయ పరిధిలో పెద్దపోటుచేను గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గ్రామంలో పర్యటించారు. అనంతరం మండల నాయకులు ప్రభుత్వం అందచేస్తున్న పథకాల లబ్ధి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.

టెలికాలర్ ఉద్యోగాలకు 23 మంది ఎంపిక

ప్రజాశక్తి-నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్‌మన్ సర్వీసెస్ సెంటర్ చెన్నై వారి సంయుక్త ఆధ్వర్యంలో టెలికాలర్ ఉద్యోగాలకు బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 23 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 60 మంది హాజరుకాగా మూడు రౌండ్ల ఇంటర్వ్యూలో 23 మందిని ఎంపిక చేశారన్నారు. యువకులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కాగా ఎంపికైన వారికి నెలకు రూ.13వేల నుండి రూ. 15వేల వరకు జీతం, ఉచిత వసతి సదుపాయం ఉంటుందని కంపెనీ ఆపరేషన్ మేనేజర్ ధన్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ పార్థసారథి , టీం లీడర్లు ఆనంద్, శ్రీకాంత్, అధ్యాపకురాలు పంకజ, జేకేసీ ఫుల్ టైం మెంటార్ లాల్ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఓటరు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించండి: టీడీపీ

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో యువతి, యువకుల ఓటరు జాబితాలో అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని టిడిపి కుప్పం నియోజకవర్గ ఇంచార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి తెలిపారు. బుధవారం టిడిపి పార్టీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, బిఎల్‌ఏలు తో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ జీరో డోర్ నంబర్‌లలో ఉన్న ఓటర్లు, దొంగఓట్లు నమోదు, టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపు వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బిఎల్‌ఓల ఇంటింటి సర్వేలో బిఎల్‌ఏలు తప్పక పాల్గొనాలని అన్నారు. ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు పై ఎటువంటి అనుమానాలు వచ్చినా వెంటనే అధికారుల దష్టికి, పార్టీ అధిష్టానం దష్టికి తీసుకురావాలన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, పార్టీ కార్యదర్శి నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీల్ కుమార్ ఎన్నికపై హర్షం

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పాశం సునీల్ కుమార్ ఎన్నికపై టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి బుధవారం హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పాశం సునీల్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

'సురక్ష' పేద ప్రజలకు వరం

గంగాధర నెల్లూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జగనన్న సురక్ష పథకం పేద ప్రజలకు వరంలాంటిదని ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాథన్‌లు అన్నారు. మండలంలోని గంగాధరనెల్లూరు, బాలగంగనపల్లె సచివాలయాల్లో సర్పంచ్‌లు సుబ్రమణ్యం, శేఖర్‌ల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ హరిబాబు, డిటి తులసీరామ్, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధాకర్, మండల జేసీఎస్ ఇన్చార్జ్ వెంకటేష్‌రెడ్డి, ఈవోపీఆర్డి శివయ్య, పంచాయతీ సెక్రటరీ అంజాద్ బాషా, చిట్టెమ్మ, సచివాలయ అధికారులు , వాలంటీర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి-పుంగనూరు: పట్టణానికి చెందిన దళితుడు జి.నాగరాజుపై మెడికల్ స్టోర్ నిర్వాహకుడు విషపూరితమైన ఇంజక్షన్లు ఇచ్చి అతని ఆరోగ్యం క్షీణింపచేయడమే కాకుండా చికిత్స పొంది తిరిగి ఇంటికి వచ్చిన అనంతరం దాడి చేసిన సంఘటన పట్టణంలో ఆలస్యం వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టంలోని కొత్తపేటకు చెందిన జి.నాగరాజు స్థానిక అంబేద్కర్ సర్కిల్ సమీపంలో ఉన్న గ్రామీణ బ్యాంక్‌లో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. 2002లో ఈశ్వరమ్మను కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు ఉన్నాడు. నాగరాజు ఈశ్వరమ్మను తిరుపతి పద్మావతి కళాశాలలో బిఎస్సి నర్సింగ్ చదివించి 2017 ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీస్ పెట్టించాడు. అయితే అక్కడే పక్క ఉన్న హెల్తీ హోమ్ మెడికల్ షాప్ యజమాని ఎస్.సాజీదూర్ రెహమాన్‌తో నాగరాజు భార్య వివాహేతర సంబంధం కొనసాగించింది. విషయం నాగరాజుకు తెలియడంతో వారిద్దరూ కలిసి నాగరాజుపై విషప్రయోగం చేశారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో నాగరాజు కుటుంబ సభ్యులు అతన్ని మెరుగైన వైద్యంకోసం తిరుపతి స్విమ్స్ తరలించగా అతనిపై విషప్రయోగం జరిగిందని వైద్యులు నిర్ధారించారు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన నాగరాజుపై రెహమాన్ అతని స్నేహితులు దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ రెండు నెలలుగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో డిఎస్పీ రఘువీరా విష్ణు తెలియజేయడం జరిగింది. కేసు నమోదు చేసినా నిందితుడిపై ఇప్పటి వరకు ఎటువంటి చార్యలు తీసుకోలేదు. ఇకనైనా తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నారు.

సామూహిక జీవనోపాదులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-చౌడేపల్లి: సదుం సోమల చౌడేపల్లి మండలం సమైక్య పరిధిలో (మినిస్ట్రీ ఆఫ్ స్మాల్ స్కేల్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్) పైన అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఐకెపి భవనంలో అడిషనల్ డైరెక్టర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని మహిళలు సామూహికంగా చేపడుతున్న జీవనోపాధి పై వారికి అదనపు ఆర్థిక వనరులు సమకూరే విధంగా చింతపండు, తేనె సేకరించ డం, చెరకు పంటలు సాగు చేయడం ద్వారా అలాంటి సభ్యులను గుర్తించి వారి కుటుంబాలకు వారికి కామన్ ఫెసిలి టేషన్ సెంటర్ ఏర్పాటుచేసి తద్వారా మెరుగైన జీవనోపా దుల కల్పన చేసేందుకు దోహదపడే అంశాలపై చర్చించారు. అధికారులు విజయ్‌కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ డిఎంకె తులసి, వెంకటేష్, మధు, సూరి, హరి, నర్సోత్తమ రెడ్డి పాల్గొన్నారు. **సోమల:** మండలంలోని స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు జీవనోపాదుల కల్పనతో పాటు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని శ్రీ శక్తి భవన్లో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మహిళలు ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తులకు సాంకేతిక పరిజ్ఞానం అందించడం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని సామూహిక ప్రణాళికలను ఎలా చేసుకోవాలో తెలియజేశారు. ఎంఎస్ఎంఈ అడిషనల్ డైరెక్టర్ కుమార్, సర్ఫ్ అధికారులు వెంకటేష్, విజయకుమార్, ఏపిఎం పాల్గొన్నారు.

ఎస్వీయూ ప్రకాశం భవనంలో దొంగలు పడ్డారు?

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రకాశం భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్లలో ఉన్నటువంటి రెండు సీసీ కెమెరాలుని ఆదివారం దొంగలు దొంగలించారు. సోమవారం ఒక పరిశోధక విద్యార్థి అందించిన సమాచారం మేరకు తెరుకున్న అధికారులు మంగళవారం సీసీ కెమెరాలు చోరీ గురైనట్లు గుర్తించారు. సిసి కెమెరా పుటేజీలను బుధవారం టెక్నీషియన్ ద్వారా రికవరీ చేసి సీసీ కెమెరాలను దొంగలను గుర్తించడం జరిగిందని ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ఏ ఆర్ మనీ తెలిపారు. వెంటనే ఈ సమస్యపై ఉన్నతాధికారులకు చర్చించి, ఎస్వీయూ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేస్తామని చెప్పారు. నిందితులు 6 కెమెరాలలో రికార్డులు ఆధారంగా కచ్చితంగా గుర్తించామని, ఆ సిసి పుటేజ్ ల ను వర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా వర్సిటీలోని వస్తువులను దోపిడీకి గురికాకుండా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దొంగిలించాలంటే విడ్డూరంగా ఉందని విద్యార్థి సంఘాలు ఆక్రోసిస్తున్నాయి. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు వర్సిటీలోని సెక్యూరిటీ కొరతను గుర్తించి వెంటనే సెక్యూరిటీని నియమించి కట్టుదిట్టంగా భద్రతను ఏర్పాటు చేసి వర్సిటీలో బయటి వ్యక్తులు చేసే ఆసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: పిఎంఇజిపి రుణాలను లక్ష్యాల మేరకు సకాలంలో గ్రౌండింగ్ చేయాలని, పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు నిబంధనల మేరకు అమలు చేయాలని, సంబంధిత అధికారులు తనిఖీలు చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల దరఖాస్తులు అందిన వెంటనే అర్హత మేరకు సత్వరమే యూనిట్లు మంజూరు చేయాలన్నారు. అనుబంధ బ్యాంకులు సత్వరమే లోన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ 2023 నుండి 255 పరిశ్రమలకు గాను 224 అనుమతులు ఇచ్చామని మరో 28 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 71 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ.4.07 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకష్ణ రెడ్డి వివరిస్తూ గత నెల సమావేశం నుండి నేటికి 10 పరిశ్రమల తనిఖీలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి తిరుపతి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, సహాయ కమిషనర్, కార్మిక శాఖ క్రిష్ణా రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు పాలకుర్తి గాయత్రి ఆదేశాల మేరకు సూళ్లూరుపేట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసేవ, ప్రకతి సేవ కార్యక్రమం కింద షార్ బస్ స్టాండ్ సర్కిల్ దగ్గరలో గల గవర్నమెంట్ గురుకుల పాఠశాల నందు విద్యా సేవలో భాగంగా బుధవారం ఇంటర్మీడియట్ పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ప్రకతి సేవలో భాగంగా మొక్కల పంపిణీ చేసి విద్యార్థినులతో కలసి మొక్కలను నాటారు. వనిత క్లబ్ ప్రెసిడెంట్ సునీత, కార్యదర్శి కళావతి, కోశాధికారి శైలజ, జోన్ చైర్మన్ సాయిరాం, హెడ్ మిస్ట్రెస్ గురు ప్రసూన పాల్గొన్నారు.

ఓటర్లను పరిశీలించుకోండి : బిఎల్ఓ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఓటర్లను పరిశీలించుకోవాలని బిఎల్ఓ బాలకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మంగళపల్లి పంచాయతీలో ఇంటింటా ఓటర్ల పరిశీలన కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లుగా నమోదు చేసుకున్నవారు ఓటర్ లిస్ట్ పరిశీలించుకోవాలని, ప్రతి గడపగడపకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయడం జరుగుతుందని గ్రామాల్లో మరణించిన వారు ఇతర వ్యక్తుల ఓట్లను గుర్తించాలని వాటిని నిర్మూలించేందుకు ఓటర్ల పరిశీలన కార్యక్రమం జరుగుతున్నదన్నారు. 18 సంవత్సరముల నిండిన ప్రతి ఒక్కరికి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళి గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిచయ వేదికను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురంలోని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎస్-ఎల్ఆర్ కళ్యాణ మండపంలో టిడిపి పరిచయ వేదిక కార్యక్రమాని నిర్వహిస్తారని ఎస్ఆర్ పురం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ థామస్ హాజరవుతారని తెలిపారు. కనుక ఎస్ఆర్ పురం టిడిపి మండల ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు, టిడిపి కుటుంబ సభ్యులు, టిడిపి కార్యకర్తలు ఈ పరిచయ వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

స్కిల్ హబ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌ను నిరుద్యోగ, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్హాబ్ కోఆర్డినేటర్ టీ.అబ్దుల్ అన్నారు. బుధవారం ఐటీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ కల్పన కోసం స్కిల్ హబ్ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణతో పాటు స్కిల్ ఇండియా సర్టిఫికేషన్. అలాగే కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్సీ, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఇతర విద్యార్హత కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కొరకు 8142509017 ఫోన్ నంబర్ను సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో మోహనమురళీ ఉన్నారు.

మాదిగల ద్రోహి బీజేపీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాదిగల ద్రోహి బీజేపీ అని, అందుకే షెడ్యూల్ కులాల వర్గీకరణ చట్టాన్ని తేవడంలో కాలయాపన చేస్తోందంటూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మండిపడ్డారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో బుధవారం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాదిగ సమాజాన్ని ఓటు బ్యాంకుగా చూస్తున్న రాజకీయ పార్టీలకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కి తొమ్మిదేళ్లు గడిచిపోతున్నా పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ప్రతిపాదన తేలేదన్నారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయనీ, గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణపై హామీలు గుప్పించిన ఏ ఒక్క రాజకీయ పార్టీ ఎస్సీ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండును తెరపైకి తీసుకురాలేదని వాపోయారు. మాదిగల్లో చైతన్యం కల్పించేందుకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నామనీ, ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్ వేదికగా 20 లక్షల మంది మాదిగలతో విశ్వరూపం మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ సభ నుంచే మాదిగలు అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగేందుకు సమర శంఖం పూరించనున్నామనీ, సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈర్ల రాజా, జి. మధు, చంద్ర, గిరి, వెంకటముని, బాలరాజు పాల్గొన్నారు.

'వర్గీకరణ జోలికి వస్తే ఖబడ్దార్'

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలల జోలికి వస్తే నువ్వు పెట్టిన పార్టీని భూస్థాపితం చేస్తామని రాయలసీమ మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ కెళావతి సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు చెందిన బోడే రామచంద్ర యాదవ్ గుంటూరు సమీపంలో కొత్త పార్టీ ఏర్పాటు చేసి పార్టీ విధి విధానాలలోఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తామని ప్రకటించడంతో రాయలసీమ మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ కెళావతి సుబ్రహ్మణ్యం ఘాటుగా స్పందించారు. మీ ఓట్ల రాజకీయం కోసం అన్నదమ్ములుగా ఉన్న ఎస్సీ కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. గత ప్రభుత్వాలు వర్గీకరణకు మద్దతు తెలిపితే ఆ పార్టీకి వ్యతిరేకంగా మాల,మాదిగలు ఐక్యంగా పోరాడి ప్రభుత్వ ఏర్పాటుకు దూరం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. మీకు ఎస్సీ కులంలో ఎన్ని ఉప కులాలు ఉన్నాయో తెలుసా?మీకు వర్గీకరణ గురించి ఏమి అవగాహనతో మాట్లాడుతున్నారు ఒకసారి ఆలోచన చేయాలని అన్నారు. అన్నదమ్ముల లాంటి మాల,మాదిగలను విడదీసే ప్రయత్నం చేస్తే రాష్ట్రములోని మాలలు నీ నూతన పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు.

బడిలో చేరిన షికారులు

షికార్లు విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన హెచ్ఎం హేమారెడ్డి

ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని డీసీఈబీ కార్యదర్శి (పాఠశాల హెచ్ఎం) కే. హేమారెడ్డి అన్నారు. బుధవారం షికారుల చిన్నారులు కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఆదరణకు సంచారజాతులైన షికారులు కూడా విద్యనభ్యసించడానికి ముందుకొస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం వెదురుకుప్పం మండలం మొరవ గ్రామ సమీపంలో ఉన్న షికారీ కాలనీకి చెందిన ఇద్దరు షికారులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించారు. అలాగే వసతిగహంలో చేర్పించారు.

'బిసివైపి దళితులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలి'

ప్రజాశక్తి-పుంగనూరు: భారతీయ చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ దళితులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని దళిత సంఘ మండల నాయకులు రాజు, పెంచుపల్లి కష్ణప్ప డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరా కూడలిలో దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీవైపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆ వర్గాలకు మేలు జరిగేలా కషి చేస్తానని చెప్పడంతో ఆ మాటలుపై వారు మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే పుట్టగతులు ఉండవు అంటూ హెచ్చరికలు చేశారు. అలాగే నియోజకవర్గంలో జరుగుతున్న అభివద్ధి పనులు చూసి ఓర్వలేక రామచంద్ర యాదవ్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. రామచంద్ర యాదవ్ దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు నక్కబండ మంజు, గంగాధరం పాల్గొన్నారు.

పొలంబడితో అధిక దిగుబడి

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండలం బోడిపాటివారిపల్లి గ్రామపంచాయతీలో బుధవారం డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వేరుశనగ పంటపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ రైతులు ఒక చదరపు మీటర్‌కు విస్తీర్ణంలో మొక్కలు ఎన్ని ఉండాలో లెక్కించి విత్తనాలు విత్తడంపై అవగాహన కల్పించారు. విత్తనాల సంఖ్య తగ్గిందా అంటే పంట దిగుబడిపై ప్రభావం చూపుతోందని తెలియజేశారు. వేరుశనగ పంటపై రైతులకు అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సంచాలకులు వెంకటరమణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని నడివీధిలో సంవత్సరానికి ఒకసారి చేపట్టే పీర్లు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి పీర్లకును ఉంచి ప్రత్యేకపూజలు చేపట్టారు. సిఐ నాగరాజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం జమీందారీ వంశస్థులు ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నమాజు చేపట్టారు.

రామకుప్పం ఎస్ఐగా శ్రీనివాస్

ప్రజాశక్తి-రామకుప్పం: మండలం ఎస్సైగా శ్రీనివాస్ బాధ్యత స్వీకరించారు. బుధవారం పోలీస్‌స్టేషన్లో సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ కష్ణయ్య బదిలీపై రొంపిచర్ల మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేయగా రొంపిచర్లలో ఉన్న ఎస్ఐ శ్రీనివాసులు రామకుప్పంకు బదిలీపై వచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు ప్రజలు సహకరించాలని, అక్రమ రవాణా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గొర్రెలపై వీధి కుక్కల దాడి

గాయపడ్డ గొర్రెలకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో వీధి కుక్కలు గొర్రెల దొడ్డి లోనికి చొరబడి 10 గొర్రెలను చంపివేయగా మరొక 10 గొర్రెలు తీవ్రగాయాల పాలయ్యాయి, మిగిలిన 20 గొర్రెలకు చిన్నపాటి గాయాలైనట్లు గొర్రెల యజమాని కష్ణప్ప తెలిపారు. బాధితుడు మాట్లాడుతూ తనకు 40 గొర్రెలు ఉన్నాయని వాటిని మేపుకొని జీవనం సాగిస్తున్నానని తెలిపారు. బుధవారం తెల్లవారు జామున రెండు నుండి మూడు గంటల మధ్య ప్రాంతంలో వీధి కుక్కలు గొర్రెల దొడ్డిలోకి వచ్చి గొర్రెలను చంపివేశాయని, దాదాపు లక్ష రూపాయలు తనకు నష్టం కలిగిందని, మిగిలిన గొర్రెలు గాయాల పాయలు అయ్యాయని ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆవేదనతో తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసులు నాయుడు, పశు వైద్యాధికారిని చందన ప్రియ సంఘటన స్థలానికి వచ్చి తీవ్రంగా గాయపడిన 15 గొర్రెలకు వైద్యచికిత్స అందించారు. స్వల్ప గాయాల పాలైన గొర్రెలకు కూడా చికిత్స అందించి మందులు మాత్రలను గొర్రెల యజమానికి అందజేశారు. కాగా వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన సాకమ్మ గోవిందు దంపతులు గొర్రెలను ఇంటికి తోలుకు వస్తుండగా వీధి కుక్కలు దాడిచేసి నాలుగు గొర్రెలను చంపివేసినట్టు సమాచారం. మండల కేంద్రమైన సోమలలో కూడా ఇటీవల గొర్రెలపై వీధి కుక్కలు దాడులు చేయడం చిన్న దూడలను కరచి గాయపరచడం చేస్తున్నాయి. పంచాయతీ వారు వీధి కుక్కల భారీ నుండి నోరులేని మూగజీవాలను కాపాడాలని పశువుల యజమానులు కోరుతున్నారు.

దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-సోమల: కలికిరి మండలం తుమ్మలపేట గ్రామానికి చెందిన ఎల్లయ్య, కలికిరికే చెందిన నలుగురు కలసి మొత్తం ఐదుగురు సోమల మండలం పల్లిగట్ల పంచాయతీ నగిరిండ్ల వద్ద ఐదు ట్రాక్టర్లతో ప్రతిరోజు మట్టిని లోడ్ చేసుకొని కలికిరికి తోలేవారు. సాయంత్రం పూట నాలుగు ట్రాక్టర్లను అక్కడే వదిలి ఒక్క ట్రాక్టర్లు అందరూ కలిసి కలికిరికి వెళ్లేవారు. క్రమంలో బుధవారం ఎల్లయ్య తన తోటి డ్రైవర్ అయినా నరసింహులుకు మీ ట్రాక్టర్లు మీ తోటి డ్రైవర్లు అందరూ కలిసి ఇక్కడ నుండి వెళ్లిపోవాలని మా ఓనర్ కుమార్ చెప్పాడని చెప్పగా మద్యం మత్తులో ఉన్న నరసింహులు ఎల్లయ్యపై గొడుగుతో దాడి చేసి కాళ్లతో తన్ని గాయపరిచాడని ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బాలచంద్రయ్య తెలిపారు.

కార్గిల్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం

కార్గిల్ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పులిచెర్ల: కార్గిల్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని జిల్లా లయన్స్ క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షులు మహమ్మదలి, కళాశాల కరస్పాండెంట్ సురేష్ రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు విఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివాస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్గిల్ అమరజవాన్లకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మహమ్మదలి, సురేష్ రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత సైనికులు తమ ప్రాణాలర్పించారన్నారు. అమరవీరుల శ్రద్ధాంజలిగా వారి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది జులై నెల 26వ తేదీన కార్గిల్ విజయ్ దివాస్‌గా భారత్ ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. కార్గిల్ అమరవీరుల సేవలు ఎన్నటికీ మరువలేమని కొనియాడారు లియో క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలి

అంగన్వాడీ సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ వినీత శ్రీ

ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాధ్యతగా గర్భిణీలకు, బాలింతలకు ఇవ్వాలని సిడిపిఓ వినీతశ్రీ తెలిపారు. పాలసముద్రం బీసీ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వస్తున్న చిన్నారులకు ఆటలపాటలతో కూడిన విద్యను తప్పక నేర్పించాలని హెచ్చరించారు. మెనూ ప్రకారం మంచి పౌష్టిక ఆహారం అందించాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అంగన్వాడీ కేంద్రంలో వైద్యం నిర్వహిస్తున్న డాక్టర్ పల్లవి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అనే కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పల్లవి అన్నారు. బుధవారం మండలంలోని ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల ఎస్ఆర్ పురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా గ్రామప్రజలకు అంగన్వాడీ కేంద్రంలో వైద్యసేవలు నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిసరాల ప్రాంతాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.